క్లుప్తంగా

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న యూనియన్ నేతలు

కర్నూలు(అర్బన్): స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ దివంగత నేత వై తారకనాథ్ వర్ధంతిని గురువారం స్థానిక ఎస్ఎంఈ, ఎంఎస్ఆర్ నగర్, పార్కురోడ్, మెయిన్ బ్రాంచ్ సిబ్బంది నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే డీజీఎస్ పీ విద్యాసాగర్ ఆధ్వర్యంలో స్థానిక అమ్మ వృద్ధాశ్రమం, అరక్షిత శిశు మందిరంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకనాథ్ సేవలకు గుర్తుగా ఏటా రెండు తెలుగు రాష్ట్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో ఆయా బ్రాంచ్‌ల లోకల్ కార్యదర్శులు జీ నాగరాజు, కే సుజాత, వెంకటరవి, పద్మజ, యూనియన్ నాయకులు పీ శ్రీకాంత్, కే ప్రవీణ్, ఎస్ శ్రీకాంత్, సిబ్బంది చాంద్‌బాషా, జబ్బార్, చరణ్‌సందీప్, జ్యోతి, శిరీషా, శైలజ, లలితమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



జవహర్‌లాల్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల సర్వీసు సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తానని ఆ శాఖ గెజిటెడ్ ఆఫీసు మేనేజర్ జవహర్‌లాల్ అన్నారు. జేడీ కార్యాలయానికి పదోన్నతిపై వచ్చిన ఆయనను గురువారం ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు అభినందించారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జేవీఓ, వీఎల్ఓ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రంగన్న, వై జనార్దన్‌రెడ్డి, కే బాబురావు, ఏఎండీ యూసుఫ్, జేవీఓలు ఎంసీ గంగా, ఆదినారాయణమ్మ, సులోచన, సుధాకర్, శ్రీరాములు, ఎల్ఎస్ఏ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీసీ సుబ్బరాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ పి సుధాకర్, లక్ష్మీదేవి, శ్రీదేవి పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఎమర్జెన్సీ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న డాక్టర్ సునీల్ యాదవ్

కర్నూలు(హాస్పిటల్): స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో గురువారం ఎమర్జెన్సీ వైద్యంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యనిపుణులు డాక్టర్ సునీల్ యాదవ్ హాజరై ఆర్టెరీల్ బ్లడ్ గ్యాస్, డీ ఫిబ్రిలేటర్, కార్డియాక్ అరిత్మియాస్‌పై అవగాహన కల్పించారు. హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో హాస్పిటల్ సిబ్బందితో పాటు 200 మంది వీక్షకులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని నిర్వహిస్తామన్నారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురువారం నుంచి వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవుల్లో వెళ్లారు. ఈనెల 26 వరకు ఆయన సెలవుల్లో వెళ్తుండటంతో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా రామలింగేశ్వర్‌ను నియమించారు. పాలనా పరమైన సమస్యలు రాకుండా ఈ నియామకం చేపట్టారు. కాగా ఈనెల 27న నగర పాలక కమిషనర్ తిరిగి విధుల్లో చేరుతారని కార్పొరేషన్ వర్గాలు ధ్రువీకరించాయి.

మంత్రిది అవగాహనారాహిత్యం

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకాన్ని ఉద్యాన పంటలకు అనుసంధానం చేస్తూ తొలి సంతకం చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ది అవగాహనారాహిత్యమని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.వీరశేఖర్, కేవీ నారాయణ గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. డబ్బున్న వారే పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారని, అలాంటప్పుడు ఉన్నత వర్గాలే ఎక్కువగా లాభం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంపై మరోసారి మంత్రి ఆలోచన చేయాలని కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ ధరలు

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశెనగ	రూ. 4042	రూ. 6790
పొద్దుతిరుగుడు	రూ. 2829	రూ. 2829
ఆముదం	రూ. 5370	రూ. 5480
వాము	రూ. 2550	రూ. 22222
ఉల్లి	రూ. 1401	రూ. 1835
ఎండుమిర్చి	రూ. 2099	రూ. 6799
శనగలు	రూ. 6741	రూ. 6810
కందులు	రూ. 10784	రూ. 11384
మొక్కజొన్న	రూ. 2270	రూ. 2371
మినుములు	రూ. 8909	రూ. 8909
కొర్రలు	రూ. 3509	రూ. 4026
సోయాచిక్కుడు	రూ. 3970	రూ. 3970

ఆర్టీసీ దుకాణాలకు కరెంట్ కట్

- పాడైపోయిన అండర్ గ్రౌండ్‌లోని కేబుల్
- త్వరగా పునరుద్ధరించాలని దుకాణదారులు వేడుకోలు



కర్నూలు ఏపీఎస్ ఆర్టీసీ

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా సంస్థ(ఏపీ ఎస్ఆర్టీసీ) పరిధిలోని దుకాణాలకు మూడు రోజులుగా కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు-1, 2 డిపోల పరిధిలో వందకుపైగా దుకాణాలున్నాయి. వాటికి కరెంట్ సరఫరా చేసేందుకు బస్టాండ్ నిర్మాణ సమయంలో అండర్ గ్రౌండ్‌లో కేబుల్స్ ఏర్పాటు చేశారు. పలు చోట్ల గుంతలు, క్వాలల కోసం తవ్వడం, తదితర కారణాల చేత కేబుల్స్ పాడైపోయాయి. దీంతో కొంతకాలంగా కరెంట్ సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతుండడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించకపోవడంతో దుకాణాదారులే సొంతంగా మరమ్మతులు చేయించుకునేవారు. ఈక్రమంలో మరోసారి సమస్య తలెత్తి అన్ని దుకాణాలకు కరెంట్ పూర్తిగా నిలిచి పోయింది. దీంతో కూల్‌డ్రింక్, బేకరీ తదితర షాపుల్లో ఫ్రిజ్‌లు పని చేయక తినుబండారాలు పాడై ఆర్థికంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు అండర్ గ్రౌండ్‌లో కేబుల్స్ మార్చుతున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయోనని ఎదురుచూస్తున్నారు. నెల రోజుల్లోనే ఒకసారి రెండు రోజులు, ఇప్పుడు మూడు రోజులు కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో వ్యాపారాలు లేక నష్టపోతున్నామని, దుకాణాల అద్దె ఆలస్యం అయితే ఆర్టీసీ అధికారులు జరిమానా వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ సరఫరా ఇబ్బందులపై ఆర్టీసీ విద్యుత్ సరఫరా విభాగం అధికారులను ఆరా తీయగా.. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ సమయంలో అండర్ గ్రౌండ్‌లో కరెంట్ సరఫరాకు కేబుల్స్ వేశారని, చాలా రోజులు కావడంతో అవి పూర్తిగా దెబ్బతినడంతో కొత్త వాటిని వేస్తున్నామని, మెయిన్ కేబుల్ సైతం మార్చి భవిష్యత్తులో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



అండర్ గ్రౌండ్‌లో కొత్తగా వేస్తున్న కేబుల్స్

నీట్ అక్రమాలపై విచారణ జరిపించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

కర్నూలు(సెంట్రల్): నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు అబ్దుల్లా, వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నీట్ పరీక్షా ఫలితాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. అంతకుముందు గాయత్రీ ఎస్టేట్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో పేపర్ లీకేజీ కావడంతనే 67 మంది విద్యార్థులు 720 మార్కులకు గాను 720 మార్కులు వచ్చాయన్నారు. ఇందుకు ఒకే సెంటర్‌లో ఆరుగురికి 720 మార్కులు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. మరోవైపు పరీక్ష సమయం తక్కువగా ఉందన్న కారణంతో 1,564 మందికి గ్రేస్ మార్కులు కలపడం అన్యాయమన్నారు. ఎక్కువ సమయం, తక్కువ సమయం అన్న దానిని ఎన్‌టీఏ ఎలా నిర్ధారిస్తుందన్నారు. గ్రేస్ మార్కులు వచ్చిన వారికి మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలపడం సరికాదన్నారు. నేషనల్ టెస్టు ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని రద్దు చేసి, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అమర్, భాస్కర్, అబుబకర్, మల్లేష్, ఆర్యన్, యోగి, ఆదిత్య, చరణ్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(వ్యవసాయం): పదవ తరగతిలో ప్రతిభ చూపిన పేద, ముస్లిం విద్యార్థినీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకోవాలని అంజుమన్ ఇస్లామియా అధ్యక్షుడు అబ్దుల్ కుద్దూస్ గురువారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3వేలు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్నామని, పట్టణ వాసులై ఉండి ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంజుమన్ కార్యాలయంలో జూలై 15వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మార్కుల జిరాక్స్ కాపీలు, కళాశాలలో చదువుతున్నట్లు ధ్రువపత్రాలు దరఖాస్తుకు జగపరచాలని, పూర్తి వివరాలకు 9866242742 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పంచేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవి



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు(సెంట్రల్): పంచేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవని, వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయ ఆవరణలో శాంతిరాం కంటి ఆసుపత్రి, కేవీ సుబ్బారెడ్డి కళాశాల, రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఉచితంగా కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులు అతి ముఖ్యమైన వారని, వారి సంక్షేమానికి స్వచ్ఛంద సంస్థలు ముందు రావాలన్నారు. పని ఒత్తిడిలో ఆరోగ్యం కోసం తగిన సమయాన్ని కేటాయించుకోవాలని ఆయన జర్నలిస్టులకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్ శర్మ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఐపీఆర్వో దివాకర్, పాత్రికేయుడు మీసాల రామస్వామి పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందిస్తున్న అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): స్థానిక బీ క్యాంప్‌లోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహానికి ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను గురువారం విరాళమిచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు హెచ్‌డీ ఈరన్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉన్నత విద్యకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం రూ.25 వేల విలువ చేసే 10 ఫ్యాన్లు, 15 ట్యూబ్ లైట్లను అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారు జి.సురేంద్రనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ రిటైర్డు జేడీ కే చిన్న నారాయణ, నాయకులు పీ కరుణానిధి, ఎస్ కిష్టన్న, డా.డీ పుణ్యశేషుడు, వసతి గృహ సంక్షేమాధికారిణులు బీ బెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలు, హాస్టళ్లల్లో సీట్లను పెంచాలి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని కేజీబీవీలలో సీట్లను పెంచాలని, బీసీ హాస్టళ్లలో చేరేందుకు అనుమతులు మంజూరు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, బి.మహేంద్రబాబు డిమాండ్ చేశారు. గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కువ మంది బాలికలు కస్తూర్బా విద్యాలయాల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా సీట్లు లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి సీట్లను పెంచాలని కోరారు. మరోవైపు బీసీ సంక్షేమ హాస్టళ్లలో చేరేందుకు ఉన్నతాధికారులు అనుమతులు మంజూరు చేయకపోవడంతో ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా సీటు కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మునిస్వామి, రసూల్, జగన్, అలీ, వీరేష్, నరేంద్ర పాల్గొన్నారు.

సామూహిక వివాహాలు చేయడం గొప్ప విషయం



కొత్త జంటలకు ఇవ్వనున్న కానుకలను పరిశీలిస్తున్న స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్

కర్నూలు(సెంట్రల్): పేద ముస్లిం యువతీ, యువకులకు సామూహిక వివాహాలు చేయడం గొప్ప విషయమని స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సబిహా పర్వీన్ అన్నారు. గురువారం నగరంలోని జీబీ ఫంక్షన్ హాలులో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం మైనార్టీ యువతీ, యువకులకు వివాహాలు చేశారు. కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. గతంలో ఆల్ హజ్ అబ్దుల్ గఫూర్ అండ్ ఖమ్రున్నిషాబేగం పూర్ గర్ల్స్ మార్యేజెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహించేవారన్నారు. వారి మరణానంతరం ఆ బాధ్యతను అవాజ్ కమిటీ తీసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం నాయబ్ సయ్యద్ సలీంపాషా వివాహాలు జరిపించారు. ప్రతి జంటకు అవాజ్ కమిటీ తరపున కానుకలు అందజేశారు. కార్యక్రమంలో అవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్ఎండీ షరీఫ్, మదీనా కాలేజీ కరస్పాండెంట్ ఎం.మహ్మద్ పాషా పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఏపీజీబీ ఎన్ఆర్ పేట బ్రాంచ్ మేనేజర్ డీఎస్ విశ్వనాథ్

కర్నూలు(సెంట్రల్): బ్యాంకింగ్ సేవలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఏపీజీబీ ఎన్ఆర్ పేట బ్రాంచ్ మేనేజర్ డీఎస్ విశ్వనాథ్ సూచించారు. గురువారం సోమిశెట్టి నగర్‌లో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూబ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.అనేక బ్యాంకులు పేదరికం నిర్మూలన కోసం సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నాయన్నారు. ఏపీజీబీలో విద్య సంబంధిత రుణాల కోసం విద్యాలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యులుగా మారాలన్నారు. అందుకోసమే తమ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వి.అశోక్‌కుమార్, కెనరా బ్యాంకు సీనియర్ మేనేజర్ పుష్పక్ పాల్గొన్నారు.

శ్రీమఠంలో 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై 'సీతా కల్యాణ వైభోగమే' చిత్ర యూనిట్ సభ్యులు గురువారం మంత్రాలయంకు విచ్చేశారు. సినీ నిర్మాత రాచల యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో నటీనటులు సుమన్ తేజ్, గరీమ చౌహాన్, దేవరాజ్, పాలమూర్ మురళీధర్ గౌడ్, రమణా రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, సాగర్ వచ్చారు. శుక్రవారం సీతా కల్యాణ వైభోగమే చిత్ర రిలీజ్‌ను పురస్కరించుకుని రాఘవేంద్ర స్వామి వారి దర్శనార్థం వచ్చినట్లు వారు తెలిపారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనానికి చేరుకుని పూజలు చేశారు. సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి
- కాల్వబుగ్గలో మొక్కలు నాటే కార్యక్రమం



కాల్వబుగ్గలో మొక్క నాటుతున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు : మొక్కలు నాటుదాం..పర్యావణాన్ని కాపాడుదామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల వద్ద 'ప్లాంట్ ఏ ట్రీ ఛాలెంజ్'లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల కారణంగా రోజురోజుకు కాలుష్యం కోరలు చాస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పోషించినప్పుడే మానవుని మనుగడ సాధ్యమవుతుందన్నారు. వర్షాలు సక్రమంగా కురవాలంటే మొక్కలు పెంచడం తప్పనిసరి అని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి 'వర్షాకాలం వచ్చింది..మొక్కలు నాటుదాం' అనే నినాదంతో 10 వేల మొక్కలు నాటాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అదే లక్ష్యంతో మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలలో సుమారు 4,885 మొక్కలు నాటినట్లు వెల్లడించారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, ఏపీడీ లక్ష్మన్న, సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, ఏపీఓ కుమార్‌సాయినాథ్, సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కల ప్రాముఖ్యత గురించి, అడవులు పరిరక్షణ, నీటి పొదుపు, నీటి పరిరక్షణ గురించి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఏపీఓ మద్దేశ్వరమ్మ, లీలావతి, పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఓర్వకల్లు: కెనరా బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు తిరుపతి ప్రాంతీయ కార్యాలయం జనరల్ మేనేజర్ పాండురంగ మితంతయ్య కోరారు. గురువారం కెనరా బ్యాంక్ ప్రతినిధుల బృందం స్థానిక కెనరా బ్యాంక్‌ను సందర్శించారు. అనంతరం పొదుపు మహిళల సౌజన్యంతో నిర్వహిస్తున్న బాలభారతి పాఠశాలను సందర్శించి పాఠశాల అభివృద్ధిని గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఓర్వకల్లు బ్రాంచి పరిధిలోని ఓర్వకల్లు, ఎస్.కొంతలపాడు, గుట్టపాడు, పాలకొలను, కన్నమడకల గ్రామాలకు చెందిన 223 గ్రూప్‌లకు సంబంధించి సుమారు 2500 మంది సభ్యులకు రూ.25 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఈ ఏడాది రూ.కోటి రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. మండల మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి మాట్లాడుతూ.. పొదుపు మహిళలు బ్యాంక్‌లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కర్నూలు రీజినల్ మేనేజర్ సుషాంత్‌కుమార్ మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి గ్రూప్‌నకు మొదట రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణసదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు బ్యాంక్‌లో అకౌంట్ లేని వారు అకౌంట్ తెరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధుల బృందం, డీఎం గౌతమ్, నరేష్, బ్రాంచ్ మేనేజర్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పోర్ట్స్

హ్యాండ్‌బాల్ విజేత మాంటిస్సోరీ



విజేతగా నిలిచిన మాంటిస్సోరీ బాలికల హ్యాండ్‌బాల్ జట్టు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో గురువారం సాయంత్రం నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో మాంటిస్సోరీ బాలికల జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో 4-3 స్కోర్‌తో సెయింట్ జోసఫ్ బాలికల జట్టుపై విజయం సాధించింది. బాలుర విభాగంలోనూ మాంటిస్సోరీ బాలుర జట్టు 9-8 స్కోర్‌తో సెయింట్ జోసఫ్ బాలుర జట్టుపై విజేతగా నిలిచిందని హ్యాండ్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి రుద్రా రెడ్డి తెలిపారు. ఈనెల 22న ఒలిపిక్ డే సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఒలింపిక్ పరుగు విజయవంతం చేయండి

కర్నూలు (టౌన్): ఈనెల 22న నగరంలో చేపడుతున్న ఒలింపిక్ పరుగును విజయవంతం చేయాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ సూచించారు. గురువారం రాత్రి ఆయన తన నివాసంలో ఒలింపిక్ పరుగు టీషర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ శనివారం నిర్వహించను ఒలింపిక్ పరుగు ఐదు ప్రాంతాల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ముంగిపు కార్యక్రమం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఉంటుందన్నారు. ఒలింపిక్ డేను పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షులు కేఈ జగదీష్‌కుమార్, కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రవీంద్ర విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (టౌన్): జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో రవీంద్ర విద్యార్థులు ప్రతిభ చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులను రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య గురువారం తన చాంబర్‌లో అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లోనూ పతకాలు సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు. అండర్-17 వాలీబాల్‌లో బంగారు పతకం, యోగాలో సాకేత్ బంగారు పతకం, చెస్ పోటీల్లో శ్రీరామ్ వెండి పతకం సాధించారన్నారు.

ఆర్చరీలో విద్యార్థి ప్రతిభ



కియానా

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కియానా ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. గురువారం విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ జస్మిత్ కౌర్ షేకూన్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 24 వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నార.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన భూపతిరావు, శ్రీధర్‌రెడ్డి

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని చాంబర్‌లో యోగా క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జాతీయ యోగా సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగిన యోగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు యోగ సంఘం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిద్ధంగా ఉందన్నారు.

స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటండి



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): స్కేటింగ్ పోటీల్లో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు సూచించారు. గురువారం స్థానిక జోహరాపురం వద్ద ఉన్న స్కేటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఈనెల 22న ఒలింపిక్ డేను పురస్కరించుకొని అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రగ్బీ, స్కేటింగ్, అథ్లెటిక్స్, తైక్వాండో, ఫుట్‌బాల్, విలువిద్య, బాస్కెట్‌బాల్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు, జట్లకు బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

తైక్వాండో పోటీలు

ఒలింపిక్ డే సంబరాల్లో భాగంగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం తైక్వాండో పోటీలు నిర్వహించారు. పోటీలను ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు, విఆర్ హాస్పిటల్ నిర్వహకులు వాసిరెడ్డి, బొల్లెద్దుల రామక్రిష్ణ పాల్గొని పోటీలను ప్రారంభించారు. తైక్వాండో నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



కేజీబీవీ విద్యార్థినులకు కిట్ అందిస్తున్న ఏపీసి విజయ జ్యోతి

కల్లూరు : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సమగ్ర శిక్ష (అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్) ఏపీసీ విజయ జ్యోతి అన్నారు. గురువారం కల్లూరు మండలం లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీసీ విజయ జ్యోతి విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తరగతి గదులో విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.